ప్రజాశక్తి
గురువారం 15 ఆగస్టు 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గోదావరి-పెన్నాకు మోక్షం ఎప్పుడో?

అనుసంధాన పనుల కోసం ఎదురుచూస్తున్న సాగర్ ఆయకట్టు రైతులు



గోదావరి పెన్నా నదుల అనుసంధానం మొదటి దశ పనుల శంకుస్థాపన శిలాఫలకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగిన ప్రాజెక్టులకు వైసిపి ప్రభుత్వ హయాంలో మూలనపడ్డాయి. తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందా అని ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఎంత వరకు తీసుకురాగలరు? నదుల అనుసంధానం నినాదం ఎంత వరకు సాకారం కాగలదన్న అంశంపై రైతుల్లో చర్చ జరుగుతోంది.

ప్రధానంగా గోదావరి-పెన్నా నదులు అనుసంధానం పనులకు శంకుస్థాపన చేసి ఆరేళ్లు గడిచినా ఇంత వరకు కదలిక లేదు. 2018 నవంబరు 27న నకరికల్లులో సిఎం చంద్రబాబు ఈ పథకానికి అప్పట్లోనే శంకుస్థాపనే చేశారు. రూ.6020.15 కోట్ల అంచనాలతో పనులకు టెండర్లు పిలిచారు. మొత్తం 66.60 కిలో మీటర్ల మేరకు కాల్వలు తవ్వాలని, ఐదు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించాలని, ఇందుకు 577 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని డిపిఆర్‌లో పేర్కొన్నారు. 2019 మే నెలకల్లా గోదావరి జలాలు కృష్ణా నది ద్వారా సాగర్‌కాల్వలలకు రప్పిస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. టిడిపి హయాంలో ఈ పథకం పనులు ఇప్పటి వరకు కాగితాలకే పరిమితం అయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్

▶ 2లో



నరకం నుండి లోకంలోకి..

- మూడేళ్లపాటు బానిసత్వం అనుభవించిన యానాది కుటుంబాలు
- ఈలోగా పరదా పట్టల్లో చీమలకు బలైన రెండేళ్ల చిన్నారి
- ఆలస్యంగా వెలుగులోకి కలప వ్యాపారి దురాఘతం

ప్రజాశక్తి - వినుకొండ

బానిసత్వం అంటే ఎలా ఉంటుందో మూడేళ్లపాటు ఆ అమాయకులు చవి చూశారు. పొద్దున్న లేచింది మొదలు చికటి పడేవరకు అక్షరాల రెక్కలను మూడేళ్లపాటు ముక్కలు చేసుకున్నారు. పొలాల మధ్య చీకట్లు కమ్మిన గుడారాల్లోనే బతుకులీడ్చారు. రోగమొచ్చిన పట్టించుకునే దిక్కులేదు. వైద్యం చేయించుకునే అవకాశం అంతకన్నా లేదు. తమ రెండేళ్ల చిన్నారి అనారోగ్యంతో అల్లాడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. చివరికి ఆ చిన్నదాని ప్రాణం చీమల చెరజిక్కింది. మృతదేహాన్ని గౌరవ ప్రదంగా ఖననం చేయడానికీ లేకుండా వాగులో పూడ్చివే యించిన దైన్యం.. ఇంతటి దారుణ పరిస్థితులను అనుభవించిన వారు అనేక ప్రయత్నాల అనంతరం స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు నరకం నుండి బయటపడ్డారు. బుధవారం వెలుగు చూసిన ఘటనపై వివరాలు బాధితుల కథనం ప్రకారం..

- 2 లో



త్రివర్ణంలో సాగర్ నీరు

2లో

జిడిసిసిబిలో రూ.6 కోట్ల కుంభకోణం

రైతుల పేరుతో రుణాలు కాజేసిన అక్రమార్కులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : గురజాల పట్టణంలోని జిడిసిసి బ్యాంకులో రూ.6 కోట్ల కంభకోణం జరిగిందని రికార్డులను ఆప్కాబ్, సహకార సంఘం అధికారులు మూడ్రోజులుగా తనిఖీ చేస్తున్నారు. బ్యాంకులో 70 మంది రైతుల పేర్లతో రూ.6 కోట్ల రుణాలను అక్రమార్కులు పొందినట్లు అధికారులు గుర్తించారు. మండలంలోని పులిపాడు, గంగవరం గ్రామల మధ్య ఉన్న ఒక కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి నిల్వలు లేకున్నా ఉన్నట్లు చూపి రుణాలు పొందినట్లు అధికారులు వెల్లడించారు. కోల్డ్ స్టోరేజ్‌లో మేజర్ వాటా ఉన్న వ్యక్తి ఈ వ్యవహారం అంతా నడిపించాడని అధికారులు అనుమానిస్తున్నారు.

అన్ని పంటలకూ ఉచిత బీమా అమలు చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌలురైతు సంఘం

ప్రస్తుతం ఖరీఫ్‌లో రైతులకు ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేయాలని, దిగుబడుల ఆదారంగా బీమా పరిహారం చెల్లించాలని ఏపీ కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో వారు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. గ్రామం యూనిట్‌గా తీసుకుని అన్ని పంటలకు బీమాను అమలు చేయాలని, ఈ-క్రాప్‌లో నమోదు చేయడంతోపాటు ఇకెవైసి

▶ 2లో



వైద్యవిద్యార్థినిపై హత్యాచారానికి నిరసనాగ్రహం





గుంటూరు రైల్వే స్టేషన్‌లో జాతీయ జెండాల ప్రదర్శన

సమరయోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధి కోసం పాటుపడాలని రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ కోరారు. గుంటూరులోని రైల్వే స్టేషన్‌లో

విభజన భయాందోళనల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 14న దేశ విభజన తరువాత పొరుగు దేశాలతో ఏర్పడిన అంతరాలతో జరిగిన ఇబ్బందులను ఆయన వివరించారు. ఇందుకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశ ఔన్నత్యాన్ని చాటూతూ చేపట్టిన కార్యక్రమంలో ఆయన జాతీయ జెండా చేబూని తిరంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ పరిధిలో అన్ని రైల్వే స్టేషన్లలో ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎగ్జిబీషన్‌ను డిసిఎం కె.కమలాకరబాబు, సీనియర్ డిపివో షేక్ షహబాబ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి-పెన్నాకు మోక్షం ఎప్పుడో?

(మొదటి పేజీ తరువాయి)

పల్నాడు దుర్భిక్షనివారణ పథకం అంటూ పేరు మార్చినా పనులు ముందుకు కదలలేదు. ఈ ప్రాజెక్టుకు తాడికొండ, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లోని ఏడు మండలాల పరిధిలో 30 గ్రామాల పరిధిలో 3541 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. భూసేకరణ ప్రక్రియ ముందుకు కదలలేదు. ఐదు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి 2019 ఖరీఫ్‌కు గోదావరి నీటిని సాగర్ ఆయకట్టుకు తరలించాలని నిర్ణయించినా సిఎం చంద్రబాబు అప్పట్లో అధికారులను ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఏ మాత్రమూ శ్రద్ధ పెట్టలేదు. సాగర్ ఆయకట్టుకు రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని ఐదు ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసేలా 2018లోనే నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు పనులు రూపకల్పన చేశారు. హరిశ్చంద్రపురం, లింగాపురం, ఉయ్యందన, గంగిరెడ్డిపాలెం, నకరికల్లులో ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని తలపెట్టారు. సాగర్ ఆయకట్టులో చాలా ప్రాంతాలకు ఎగువ నుంచి నీరు రాకపోవడం వల్ల రైతులు సకాలంలో పంటలు వేయలేకపోతున్నారని, దీనివల్ల ఒక పంటను కోల్పోతున్నారని వ్యవసాయ నిపుణులు తేల్చారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎగువన ఉన్న జలాశయాలన్నీ నిండితేనేసాగర్‌కు నీరు వస్తుంది. లేదంటే అప్పటి వరకు వేచిచూడాల్సిందే.

గత ఏడాది ఎగువ నుంచి నీరు రాకపోవడంతో సాగర్ ఆయకట్టు పరిధిలో వరిసాగు జరగలేదు. ఈ ఏడాది ఎట్టకేలకు వరద రావడంతో సాగర్ జలాశయం నిండింది. దీంతో పులిచింతల జలాశయం కూడా నిండటం వల్ల అటు డెల్టాలోనూ, ఇటు సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి ఎద్దడి తీరింది. అయితే వృదాగా పోతున్న గోదావరి జలాలను కృష్ణా, పెన్నా నదులకు అనుసంధానం చేస్తే కోస్తా జిల్లాల్లో సాగునీటి ఇబ్బందులు తొలగి దాదాపు 30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని భావించి అప్పట్లో గోదావరి, పెన్నా అనుసంధాన పనులకు శ్రీకారం చుట్టారు. అయితే గత ఐదేళ్లుగా ఎటువంటి కదలిక లేకపోవడంతో నూతనంగా వచ్చిన ప్రభుత్వం ఏ మేరకు దృష్టిసారిస్తుందో వేచిచూడాల్సిందే.

నరకం నుండి లోకంలోకి..

- మూడేళ్లపాటు బానిసత్వం అనుభవించిన యానాది కుటుంబాలు
- ఈలోగా పరదా పట్టల్లో చీమలకు బలైన రెండేళ్ల చిన్నారి
- ఆలస్యంగా వెలుగులోకి కలప వ్యాపారి దురాఘతం



ప్రజాశక్తి - వినుకొండ

ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన యానాది కుటుంబాలైన మల్లవరపు సుబ్బారావు-మరియమ్మ, పొట్లూరి అంజయ్య-కొండమ్మ, మల్లవరపు నరసింహం-నాగలక్ష్మి, నంబూరి అంజయ్య, మల్లవరపు దుర్గారావు-అనిత, నంబూరి కావయ్య-బ్రహ్మమ్మ కుటుంబాలకు చెందిన 25 మందిని వినుకొండ పట్టణానికి చెందిన జామాయిల్ కలప వ్యాపారి షేక్ మస్తాన్‌వలి మూడేళ్ల కిందట జామాయిల్ కర్ర కొట్టే పనికని తెచ్చి నూజెండ్ల వద్ద రెండు కిలోమీటర్ల దూరంలో పొలాల మధ్య పరదాల పట్టాలతో వేసిన గుడారాల్లో ఉంచాడు. టన్ను కర్ర కొడితే రూ.400 చెల్లిస్తానని వారితో మాట్లాడుకున్నాడు. మూడేళ్లుగా చిన్న పిల్లలతో సైతం పని చేయించుకుని రోజుకు 8-10 టన్నుల కర్ర కొట్టించుకుంటున్నాడు. అయితే నెలకు కుటుంబానికి రూ.3 వేలు చొప్పున విడతల వారీగా రూ.5 లక్షలు ఇచ్చాడు. తాము ఇంత చాకిరి చేస్తున్నా డబ్బులు రావడం లేదని నిరాక్షరాస్యులైన వారు అడిగితే బెదిరింపు ధోరణిలో సమాధానమిస్తూ చివరికి 'మీరే నాకు రూ.8 లక్షలు బాకీ.. అవి మొత్తం తీర్చేదాక పని చేయాల్సిందే' అంటూ అమాయకులైన యానాదులను మరింతగా బెదిరించాడు. ఎవరైనా అనారోగ్యం పాలైనా కనికరం లేకుండా వ్యవహరించాడు. ఆస్పత్రులకు వెళ్తే మందుల ఖర్చులకైనా డబ్బులు ఇవ్వకపోవడంతోపాటు ఆతనే కొన్ని మందులు తెచ్చి ఇచ్చి వాటినే వేసుకుని పని చేయాలనేవాడు. బాధితుల్లో ఒకరైన నంబూరు అంజయ్య కుమార్తె అయిన రెండేళ్ల చిన్నారి అనారోగ్యానికి గురైనా వైద్యం చేయించలేదు. గుడిసెల్లోనే ఆ పసిపాప చీమలు కుట్టి మృత్యువాత పడగా పక్కనే వాగులో పూడ్చి వేయించాడు.

రోజంతా చాకిరి చేస్తున్నా కడుపు నిండా తిండి లేకపోవడం, తమ బిడ్డలు చిరిగిన గుడ్డలు, చింపిరి దుస్తులతో కళ్లల్లోనే ఆకలిని పెట్టుకుని తమ కళ్లముందు తిరుగుతుండడం, చివరికి ఈ పరిస్థితులు రెండేళ్ల పసిదాన్ని పొట్టన పెట్టుకోవడంతో వారు తట్టుకోలేక పోయారు. ఈ కట్టుబానిసత్యం నుండి నుండి ఎలాగైనా బయటపడాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. చివరికి యానాది సంఘాల మహాకూటమి నాయకులకు తమ దారుణ పరిస్థితులను తెలియజేయగలిగారు. యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి, చల్లంచర్ల ప్రసాదు బాధితులుండే ప్రదేశానికి వచ్చి వారు నిర్బంధంలో అనుభవిస్తున్న దీనస్థితిని చూశారు. గత సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో వినుకొండ రూరల్ సిఐ సుధాకర్ బుధవారం వెళ్లి బాధితులను కలిశారు. యానా దులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న మస్తాన్‌వలిని విచారణ చేశారు. పరిస్థితి మొత్తం పోలీసులకూ అర్థమ వడంతో మస్తాన్‌వలిని మందలించి యానాది కుటుం బాలను ఆయన నుండి విడిపించారు. నరకకూపం నుండి బయట పడినట్లు బాధితులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ మస్తాన్‌వలిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన చేసిన శ్రమ దోపిడీ మొత్తాన్ని బాధితులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వైద్యవిద్యార్థినిపై హత్యాచారానికి నిరసనాగ్రహం

ప్రజాశక్తి - మంగళగిరి, గుంటూరు జిల్లాప్రతినిధి



కలకత్తా ఆర్‌జికెఎఆర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థిపై హత్యాచారాన్ని ఖండిస్తూ మంగళగిరి ఎయిమ్స్, గుంటూరులోని మెడికల్ కాలేజీలో వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది బుధవారం నిరసన చేపట్టారు. ఇలాంటి పాశవిక చర్యలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని నినదించారు. ప్రస్తుతం సాధారణ సేవలకు మాత్రమే పెన్‌డౌన్, స్టెతస్కోప్ డౌన్ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే అత్యవసర సేవలనూ నిలిపివేస్తామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది రక్షణపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్టం అమలు చేయకుంటే రానున్న రోజుల్లోనూ పోరాడతామన్నారు. ఇదిలా ఉండగా స్థానిక గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ, ఆస్పత్రిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. గుంటూరులో మెడికల్ కళాశాల జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపగా వీరికి ప్రభుత్వ వైద్యుల సంఘం మద్దతు ప్రకటించింది. మంగళగిరి నిరసనలో ఎయిమ్స్ సీనియర్ రేసిడెంట్ డాక్టర్ జగదీష్, ఎయిమ్స్ వైద్యులురష్మిత, రాజేశ్వరి, విజయ్, శ్రీలక్ష్మి, సుభిక్ష, నూతక్కి, రామచంద్రపురం పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ చండీ ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారా యణ, గుంటూరు నిరసనలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, వైద్యులు ఎస్ఎస్‌వి రమణ, శ్రీనివాస ప్రసాద్, సంతోష్, నారాయణరావు, పార్వతి, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు దిక్షిత్, ప్రధాన కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

అన్ని పంటలకూ ఉచిత బీమా అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని కోరారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రదాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని ఆహార పంటలకు ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం బీమా ప్రీమియం ప్రభుత్వమే రైతులు వాటాగా బీమా కంపెనీలకు చెల్లించాలన్నారు. రైతులు బ్యాంకుల నుండి పంట రుణాలను తీసుకున్నప్పుడు బీమా ప్రీమియాన్ని వసూలు చేసేవారని, మిగిలిన వాటా ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం కంపెనీలకు చెల్లిస్తున్నాయని చెప్పారు. పంటలు నష్టపోయినప్పుడు బీమా పరిహారాన్ని బీమా కంపెనీలు నష్టాన్ని బట్టి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఉచిత పంటల బీమాను అమలు చేస్తామని, రైతుల వాటా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పి, బీమా కంపెనీలకు ప్రీమియం వాటాను చెల్లించలేదని, దీంతో కేంద్రం చెల్లించాల్సిన వాటా చెల్లించక పోవడంతో రైతులు నష్టపోయిన పంటలకు పూర్తి బీమా పరిహారం దక్కడం లేదని వివరించారు. దిగుబడులు తగ్గినా ఇందుకు వాతావరణం కారణమైనా వాతావరణ పరిస్థితులు సరిగానే ఉన్నాయంటూ బీమా అమలు చేయలేదని విమర్శించారు. వర్షాధార పంటలకే బీమాను అమలు చేయడం వల్ల నీటి వసతి ఉన్న భూములకు పంట నష్టం జరిగినా బీమా అమలు కాలేదని తెలిపారు. పంటల బీమాలో ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించిన నేపథ్యంలో రైతులపై భారం మోపకుండా రైతుల వాటా ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లించాలని, బీమా పత్రాలను రైతులకు అందించాలని కోరారు. అన్ని పంటలకు సమగ్ర పంటల బీమా, ప్రభుత్వ రంగంలో బీమా కంపెనీని ఏర్పాటు చేయాలని, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు బీమా పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నరసరావుపేట రూరల్ ఎస్సైగా కె.లేఖ ప్రియాంక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట రూరల్ స్టేషన్ ఎస్ఐగా కె. లేఖ ప్రియాంక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తుళ్లూరు ట్రాఫిక్ ఎస్ఐ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా నరసరావుపేట రూరల్ ఎస్సైగా నియమితులయ్యారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

ప్రజాశక్తి - మేడికొండూరు

మానవ మను గడకు మొక్కలు ఎంతగానో బాధపడతాయని గుం టూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మేడికొండూరు మండలం విషదల గ్రామ రహదారిలో ఎవెన్యూ ప్లాంటేషన్ లో భాగం గా బుధవారం ఉదయం కలెక్టర్ నాగలక్ష్మి మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో క రోడ్డుకి ఇరు వైపులా ఒక కిలోమీటర్ పరిధిలో 400 మొక్కలను రూ. 3.77 లక్షలతో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోపాటు మానవాళి మనుగడకు అవసరమైన ఆక్సిజన్ అందించడంలో చెట్లు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ పర్యవేక్షిస్తూ వాటిని పరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. డ్వామా పిడి ఉమాదేవి, ఎంపీడీవో ప్రభాకర్ రావు,తహసిల్దార్ బి.పద్మనాభుడు,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం కె కిరణ్మయి, మేడికొండూరు సిఐ దార్ల జయ కుమార్ పాల్గొన్నారు.



త్రివర్ణంలో సాగర్ నీరు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎగువ శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం తిరిగి కొనసాగడంతో బుధవారం 2 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి సాగర్ జలాశయానికి 63,123 క్యూసెక్కుల వరద వస్తుండటం, సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిడటంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590, నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా నీటి మట్టం 590 అడుగుల వద్ద, నీటి నిల్వ 312.0450 టీఎంసీల వద్ద ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,394 క్యూసెక్కులను, కుడి కాల్వ ద్వారా 7528 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7601 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కుల, లోలేవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులు మొత్తంగా 63,123 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ వద్ద జాతీయ జెండా రంగులతో లైటింగ్ ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇదిలా ఉండగా సాగర్ ప్రధాన డ్యాంపై సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసన్ నేతృత్వంలో జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
గురువారం 15 ఆగస్టు 2024

నరసరావుపేటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు
ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

78 వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో జాతీయ జండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పట్టణంలోని ఎ -1 కన్వెన్షన్ హాలుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణబాబు మర్యాద పూర్వకంగా మంత్రిని కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తో పాటు మంత్రితో పలు అంశాలపై చర్చించారు. తొలుత పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం మంత్రిని నరసరావుపేట ఆర్డీఓ పి. సరోజిని, జిల్లా పౌర సఫరాల శాఖ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, డిఎస్ఒ పద్మశ్రీ తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.




మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న కలెక్టర్, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

తూనికలు కొలతల శాఖ అధికారులు దాడులు
రైస్ మిల్లుల్లో బియ్యం బస్తాకు రెండు కేజీల వ్యత్యాసం



రైస్ మిల్లులో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైస్ మిల్లులపై తునికల కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. తూనికలు కొలతల శాఖ రీజియన్ జాయింట్ కంట్రోలర్ ఎం ఎన్ ఎస్ మాధురి అసిస్టెంట్ కంట్రోలర్ అలురయ్యలు ఆకస్మికంగా దాడులు చేశారు. అమరావతి మేజర్ కాల్వ ప్రక్కన ఉన్న రైస్ మిల్లు, పారి శ్రామిక వాడలో ఉన్న రైస్ మిల్లు పై దాడులు నిర్వహించారు. బియ్యం బస్తాలు కాటల్లో తేడాలు ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా తూనికలు కొలతలు శాఖ జాయింట్ కంట్రోలర్ మాధురి మాట్లాడుతూ బియ్యం బస్తాలు 25 కిలోల బస్తా ఉండాల్సి ఉండగా 1,2 కిలోలు తక్కువ ఉంటున్నాయని, అలాగే 26 కిలోలబియ్యం బస్తా కూడా తక్కువగా ఉన్నాయని ఈ తనిఖీలలో గుర్తించామన్నారు. బియ్యం బస్తాలు తూకం లో తేడాలు ఉండటం పట్ల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమెతెలిపారు. రైస్ మిల్లు నిర్వాహకుల పై కేసులు నమోదు చేశారు.ఈ దాడుల్లో సత్తెనపల్లి ఇన్స్పెక్టర్ సైదా పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 49,968
మిర్చి ఎగుమతి	: 47,894
మిర్చి నిల్వ	: 25,370

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 16,000
నెం.5	9,000 - 12,000
273	11,500 - 12,500
341	8,000 - 16,000
సూపర్10	10,000 - 10,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 18,800
బడిగి	8,000 - 15,500
దేవనూరు డీలక్స్	8,500 - 11,500
తాలుకాయలు	4,500 - 12,000
ఎసి	
334	9,000 -16,000
నెం.5	11,500 - 13,000
341	9,000 - 16,000
4884	10,000 - 14,000
తేజ	7,500 - 18,500
బడిగి	9,000 - 15,500
దేవనూరు డీలక్స్	9,500 - 12,000
తాలుకాయలు	5,000 - 11,000

గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగారావు పాలెం వద్ద సాగర్ కుడి కాలువలో (పెదనందిపాడు బ్రాంచ్ కాలువ) గుర్తుపట్టలేని విధంగా ఉన్న, సుమారు 30 ఏళ్ల మగ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. కాల్వలో నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చింది. సుమారు 3 నుంచి 4 రోజుల మధ్యలో ఈతకు వచ్చి మునిగి చనిపోయి ఉంటాడని, నాదెండ్ల గ్రామానికి చెందిన దావులూరి జాన్ అనే అబ్బాయి తప్పిపోయినందున వాళ్ళ బంధువులు వెతికే క్రమంలో ఈ మృతదేహాన్ని వారు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఉద్యాన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులు ఉద్యాన పంటను సాగు చేపట్టి ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివద్ధి సాధించాలని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ కె శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పల్నాడు జిల్లాలోని యడ్లపాడు, నరసరావపేట మండలాలలోని వివిధ గ్రామాలలో ఉద్యాన శాఖ సూచనల మేరకు రాయితీలు



అందిపుచ్చు కుని సాగులో ఉన్న ఉద్యాన పంటలను బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, డ్వామా పిడి జి జోసెఫ్ కుమార్, సూక్ష్మ నీటి సేద్యం జిల్లా అధికారి ఆంజనేయులు తదితరు లతో కలిసి పరిశీలించారు. యడ్లపాడు మండలం కొత్తపాలెంలో రాట్నాల రామయ్య, రాట్నాల భువన్నారాయణ ల శాశ్వత పందిరి పై దొండ సాగు,కరివేపాకు పంటలను, నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో షేక్ సాంబశివరావు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటలను సందర్శించారు. అదేవిధంగా గురవాయపాలెం గ్రామం లోని చంద్రు గురుస్వామి షేడ్ నెట్ హౌస్ ను, యలమందలోని కరివేపాకు పంటలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధి కారి సి.హెచ్. వి రమణా రెడ్డి, నరసరావుపేట ఉద్యాన అధికారి డి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సొంత మండలానికి ఎంపిడిఒ

ప్రజాశక్తి - యడ్లపాడు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లిన ఎంపిడిఒ తిరిగి సొంత మండలానికి వచ్చారు. యడ్లపాడు ఎంపిడిఒగా పనిచేస్తున్న వై.హనుమారెడ్డి, ఎన్నికల విధుల నిమిత్తం ప్రకాశం జిల్లా బల్లికురవ మండలానికి వెళ్లగా, అదేజిల్లాలోని మద్దిపాడు మండల ఎంపిడిఒ వై.శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులు తమ సొంత మండలాలకు బదిలీలు కావాలంటూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 9న వై శ్రీనివాసరావు ప్రకాశం జిల్లాకు వెళ్లగా, అక్కడ పనిచేస్తున్న వై.హనుమారెడ్డి 10వ తేదీన తిరిగి యడ్లపాడు మండల ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు.

చెక్కా రాజేష్ మృతదేహం లభ్యం



ప్రజాశక్తి-మాచర్ల రూరల్

కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు రోజుల క్రితం సెల్ఫీ వీడియో విడుదల చేసి కనిపించకుండా పోయిన చెక్కా రాజేష్ (30) మృత దేహంగా మారాడు. బుధవారం ఉదయం కుడి కాలువకు చెందిన బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద రాజేష్ మృతదేహం కనిపించడంతో పోలీసులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వ హించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. రాజేష్ తండ్రిని ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ, సోషల్ మీడియాలో చురుకుగా పనిచేసే రాజేష్ మరణ వార్తను విన్న మంత్రి నారా లోకేష్, ఆయన భార్యబ్రహ్మాణిలు సోషల్ మీడియా ద్వారా రాజేష్ కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామును చంపి ఆపై గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-ఈపూరు



పాము కాటుకు గురై గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని అంగలూరులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన యలమంద (35) గ్రామ సమీపంలో గొర్రెలను కాస్తుండగా పాము గొర్రెల పైకి వస్తుడంతో దానిపైకి రాయి విసిరాడు. మరల అదే రాయిని తీసుకునే క్రమంలో చేతిపై పాము కాటు వేసింది. వెంటనే పామును కొట్టి చంపాడు. ఇంటికి వెళ్లి పాము కరిచిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో బొల్లాపల్లి మండలం ఘాటి తండాకు నాటు వైద్యం కోసం తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

టిడిపిలోకి మరో కౌన్సిలర్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరసింహారావు వైసిపిని వీడి బుధవారం టిడిపిలో చేరారు. ఆయన్ను పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, కౌన్సిలర్ మదార్‌సాహెబ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పిల్లలకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-ముప్పాళ్ల



స్థానిక పిహెచ్‌సిలో పసి పిల్లలకు వ్యాక్సినేషన్ బుధవారం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి పి.రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సినేషన్ ఉంటుందన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్ణీత టీకాలను తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. పిల్లలకు తల్లి పాలు శ్రేయస్కరమని, అవే వారిని పూర్తి ఆరోగ్యంగా ఉంచుతాయని అన్నారు. ఎదిగే పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వర్ష కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు, 60 ఏళ్లు దాటినా వారికి బిసిజి వ్యాక్సిన్ వేస్తున్నామని, కావాల్సిన వారు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పీటర్ డామియెన్, ఎఎన్ఎమ్ జ్యోతి, ఆశా వర్కర్ పద్మ పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-వినుకొండ

వరదలు, విపత్తుల వల్లనష్టపోయిన వారికి మానవత్వంతో తగిన సహాయం చేయడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి అన్నారు. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాతంలో కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడి జరిగిన ఘోర ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో వినుకొండలో బుధవారం విరాళాలు సేకరించారు. పల్నాడు రోడ్డు లోని సిపిఎం కార్యాలయం నుండి అరుణ థియేటర్, మార్కాపురం రోడ్డు, ఆర్టీసీ బస్టాడ్ సెంటర్లలో విరాళాలు సమీకరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్కే రంజాన్ బీ, తిరుమలక్ష్మి, రామకృష్ణ, రాజ్యలక్ష్మి, శారమ్మ, కోటమ్మ పాల్గొన్నారు.




అనుమతి లేకుండానే రైతుల పొలాల్లో బిపిసిఎల్ పైప్‌లైన్

- న్యాయమైన పరిహారం కోసం రైతు సంఘం వినతి
- 19న యాజమాన్యంతో సంయుక్త సమావేశానికి హామీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నుండి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ పరిసర ప్రాంతం మాధవరం వరకు రైతుల భూముల్లో నిర్మిస్తున్న బిపిసిఎల్ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణంలో నష్టపోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. శావల్యాపురం మండలం కారుమంచిలో పైపులైన్ నిర్మాణం వల్ల నష్టపోతున్న రైతులు బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహాశీల్దార్ కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. గోపాలరావు మాట్లాడుతూ రైతులను ఏమాత్రం సంప్రదించకుండా, వారి అనుమతి లేకుండా వారి పొలాల్లో బిపిసిఎల్ యాజమాన్యం అక్రమంగా పైపులైను నిర్మిస్తోందని విమర్శించారు. శావల్యాపురం, రొంపిచర్ల, నకరికల్లు, పిడుగురాళ్ల, కారంపూడి, గురజాల మండలాల్లోని 18 గ్రామాల నుండి ఈ పైప్‌లైన్ నిర్మాణం జరుగుతున్నా ఏ గ్రామంలో కూడా రైతులతో కనీస సంప్రదించలేదని, యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇచ్చే పరిహారం 1962 పెట్రోల్ కెమికల్ చట్టం ప్రకారం ఇవ్వడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాక, భూములు విలువకూడా పూర్తిగా పడిపోతుందని, దీనివల్ల రైతులు తీవ్ర నష్టానికి గురవుతారని అన్నారు. గతంలో



హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ నిర్మాణం జరిగినప్పుడు ఇచ్చినవిధంగా పరిహారం ఇవ్వాలని, రైతుల అనుమతి మేరకే పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. దీనిపై స్పందించిన తహాశీల్దార్ మాట్లాడుతూ ఈనెల 19న రైతులు, బిపిసిఎల్ యాజమాన్యం, రెవెన్యూ సిబ్బందితో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి, రైతుల సందేహాలు నివృత్తి చేసి, న్యాయమైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చేకూరి సురేష్‌రాజా, కెవిఆర్ మోహన్‌చందు, ఆర్.మునివెంకటేశ్వర్లు, బాధిత రైతులు మన్యం వెంకటేశ్వర్లు, బొల్లా అప్పారావు, ఎర్రబిక్కి ఆంజనేయులు, వై.సురేష్, పి.అచ్చయ్య, ముప్పా గిరిప్రసాద్, కొచ్చర్ల కమాలు, పగిడి శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రతిఇంటిపై జాతీయ జెండాను ఎగరేద్దాం



ప్రజాశక్తి - వినుకొండ :

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను రెపరెపలాడించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా పట్టణంలోని కారంపూడి రోడ్డు ఎన్ఎస్పీ కాల్వకట్ట వద్ద నుండి 150 మీటర్ల జాతీయ జెండాతో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించగా ఎన్ఎస్పి కాలని వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్తూపం సెంటర్ మీదగా మున్సిపల్ కార్యాలయం, గుర్రం జాషువా కళామందిరం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులు ప్రాణ త్యాగాల ఫలితంగానే నేడు భారతీయులంతా స్వేచ్ఛతో జీవిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎం.రమేష్, నాగ శ్రీను రాయల్, ఎన్.శ్రీనివాసులు, పివి సురేష్‌బాబు, ఎస్.జానీబాషా, పి.కృష్ణ, ఎన్.కిషోర్, ప్రశాంత్, ఎంఈఓ జఫ్రూల్లాఖాన్,



గీతాంజలి స్కూల్ డైరెక్టర్ ఎండ్లూరి కిషోర్ పాల్గొన్నారు. స్థానిక గీతాంజలి స్కూల్స్ నందు 78వ స్వాత్రంత్ర దినోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ప్రిన్సిపల్ టి.కృష్ణవేణి ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని దేశం గర్వపడే పౌరులుగా ఎదగాలని, భారతదేశ ఔన్నత్యాన్ని గుర్తిరెగి దేశం కీర్తిని నలుమూలల వ్యాపింపజేయాలని చెప్పారు. విద్యాసంస్థల కరెస్పాండెంట్ వైఎల్ కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫొటోలు, సెల్ఫీలు దిగి అప్‌లోడ్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని, ప్రతిఇంటిపైనా జాతీయ జెండాలు ఎగరేయాలని, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. దీనిపై పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి జాతీయ జెండాలతో ర్యాలీలు చేయాలని, వాటి ఫొటోలను తీసి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పంచాయతి రాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతిలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలన్నారు. మండల ప్రధాన కేంద్రాల్లో, అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ సెల్ఫీ దిగి ఫొటోను వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. మున్సిపాల్టీల్లో, బస్‌స్టాండ్లలో, రైల్వే స్టేషన్ వద్ద ప్రాముఖ్యత ఉన్న కూడళ్లలో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచిన వారిని జిల్లాస్థాయిలో సన్మానిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపా ధ్యాయ పురస్కారం-2024 అవార్డులకు ఉపాధ్యా యిని, ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారునకు కనీసం 15 ఏళ్ల అనుభవం కలిగి ఉండాలని, దరఖాస్తులను ఈ నెల 20లోగా ఎంఇఒలకు, ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులైతే ఉప విద్యాశాఖాధికారులకు అందజేయాలని సూచించారు.

ఉత్సాహంగా దేశభక్తి గేయాల పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేటి బాలలే రేపటి భావి భారత భవిష్యత్ నిర్దేశకులని పల్నాడు బాలోత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసరావుపేట పట్టణ సమీపంలో లింగంగుంట్ల గ్రామ పరిధిలో గల శంకరభారతిపురం జెడ్‌పి పాఠశాలలో పల్నాడు బాలోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను పల్నాడు బాలోత్సవాల కమిటీ అధ్యక్షులు, ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సిహెచ్ రాజగోపాల్‌రెడ్డి (రాజారెడ్డి) ప్రారంభించి మాట్లాడారు. దేశ భవిష్యత్ విద్యా సంస్థలు నిర్దేశించే విద్యా విధానాలలో, విద్యార్థుల్లో దాగి ఉందన్నారు. ప్రముఖ న్యాయవాది మోదుగుల ఆరోగ్యం చౌదరి మాట్లాడుతూ బాలల నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమాలు తగ్గిపోయాయయని, ఈ సమయంలో సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తున్న పల్నాడు బాలోత్సవాల కమిటి ఆధ్వర్యంలో విద్యార్థులలో పోటీలు అభినందనీయమని చెప్పారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలని, అందుకు ప్రోత్సహించడానికి బాలోత్సవం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

అలరించిన దేశభక్తి గేయాలు...

విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు ఎంతగానో అలరించాయి. సోలో, జూనియర్, సీనియర్ అన్ని విభాగాల్లో ఐగ్రో ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా ఆయా విభాగాల్లో ద్వితీయ స్థానంలో ప్రతిభ చాటిన సెయింట్ జోసెఫ్, శంకర భారతపురం పాఠశాల, ఆక్స్‌ఫర్డ్, టైనీటాట్స్ హైస్కూల్, తృతీయ స్థానంలో



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న బాలోత్సవాల కమిటీ సభ్యులు, న్యాయనిర్ణేతలు

నిలిచాయి. ప్రతిభ చాటిన ఆక్స్‌ఫర్డ్, టైనీ టాట్స్ ఐఐటి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో పాటు మున్సిపల్ బాలికల హైస్కూల్, నరసరావుపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, టై టాట్స్ ఒలంపియాడ్, ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థులకు బాలోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేశారు.

అనంతరం కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల్ని చదువుతోపాటు క్రీడ, కళ నైపుణ్యాల్లో ప్రోత్సహించాల న్నారు. పిల్లలు ఒత్తిడితో కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, వారి అభిరుచులను, సృజనాత్మకతను, జ్ఞానతృ ష్ణను ప్రదర్శించే స్వేచ్ఛను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కల్పించాలని చెప్పారు. బాల్య దశలో ఆట, పాట, కళ ఆధారిత అంశాలల్లో సరదాగా గడపాల్సిన అవసరముంద న్నారు. కార్యక్రమంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు భాగేశ్వరిదేవి, శివపార్వతి, డి.శివకుమారి, షేక్ సిలార్ మసూద్, కె.రామారావు, కోయా రామారావు, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎస్.కె.జిలాని మాలిక్, జె.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పెండింగ్ పనుల పూర్తికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మంగళగిరిలోని అఖిల భారత వైద్యా విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో మౌలిక సౌకర్యాల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి నీరబ్‌కుమార్ ప్రసాద్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 13వ షెడ్యూల్‌లోని కేంద్రప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిమ్స్‌కు అప్రోచ్ రోడ్ల పెండింగ్ పనులు, నీటి సౌకర్యం, ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎయిమ్స్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మా మాట్లాడుతూ ఎయిమ్స్ ఆసుపత్రి విస్తరణకు సంబంధించి రీసెర్చ్, క్యాన్సర్ తదితర విభాగాల ఏర్పాటుకు 10 ఎకరాల స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్‌బాషా, ఆర్అండ్‌బీ ఈఈ సమర్పణరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

నేడు, రేపు కెఎల్‌పి స్కూల్లో రోబోటిక్ సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణప్రసాద్

జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో 15, 16 తేదీల్లో రోబోటిక్ సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేడు ఉదయం 11 గంటలకు సైన్స్ ఎక్స్‌పోను నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ప్రారంభిస్తారన్నారు. ఏ పాఠశాల విద్యార్థులైనా ఈ ఎక్స్‌పోను సందర్శించి విజ్ఞానం పెంచుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ ఆధారిత సబ్జెక్టులకు ప్రాధాన్యత పెరిగిందని రాబోయే కాలమంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ శాసిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను ఆ దిశగా తీర్చిదిద్దటానికి 8వ తరగతి నుండే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టును బోధిస్తున్నట్లు చెప్పారు. గత సమ్మర్ క్యాంప్‌లో కెఎల్‌పి పాఠశాలలో ప్రొఫెసర్ శ్రీనివాస్ సహకారంతో తమ విద్యార్థులు రూపొందించిన రోబోట్స్‌ను ఈ సైన్స్ ఎక్స్‌పోలో ప్రదర్శించబోతున్నట్లు తెలిపారు. ఇంటి అవసరాలకు వినియోగించేవి, హెల్త్‌కేర్, వ్యవసాయం, పర్యావరణం తదితర రంగాల్లో ఉపయోగించుకోవటానికి వీలుగా రోబోట్ నమూనాలు రూపొందించినట్లు చెప్పారు. కావున విద్యార్థులు, తల్లిదండ్రులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ప్రొఫెసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొండవీటి వాగులో తూటికాడ తొలగించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

కొండవీటిలో పెద్దఎత్తున పేరుకుపోయిన తూటు కాడ, గుర్రపు డెక్క తొలగించాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వాగును పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వాగు ఆనవాలు కనబడని విధంగా పెద్దఎత్తున చిట్టడవిలాగా వాగులు తూటుకాడ, గుర్రపుడెక్కతో నిండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కొండవీటి వాగులో గడ్డిపూసను కూడా తొలగించలేదని చెప్పారు. తాడికొండ మండలం లాం దగ్గర నుంచి ఉండవల్లి వరకు ఐదు మండలాల్లో 29 కిలోమీటర్ల పొడవు విస్తరించి ఉన్న కొండవీటి వాగును యుద్ధప్రాతిపదికన వెంటనే బాగు చేయాలని కోరారు. ఈ వాగు కింద 13,500 ఎకరాలు సాగవుతుందన్నారు. రాజధాని నేపథ్యంలో ఉండవల్లి వాగు హెడ్ స్లూయిస్ వద్ద పదేళ్ల క్రితం నిర్మించిన ఎత్తి పోతల పథకం సజావుగా పని చేయాలని గుర్రపుడెక్క, తూటుకాడను తొలగించాలని చెప్పారు. ఈ పని చేయ కుండా ఎన్ని ఎత్తిపోతల పథకాలు పెట్టినా ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి.వీరాస్వామి, టి.బక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా పూర్తి పారదర్శకంగా ఎస్ఎస్ఆర్ 2025 ప్రక్రియ ఈనెల 25వ తేది నుండి 2024 అక్టోబర్ 18 వరకూ నిర్వహిస్తున్నట్లు డిఆర్ఓ పెద్ద రోజా తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డిఆర్ఓ పెద్ది రోజా ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాల వయసు పైబడిన వారందరిని నూతన ఓటరుగా చేర్చేందుకు చర్యలు చేపట్టటం జరుగుతుందన్నారు. బిఎల్ఓల ద్వారా డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేసి ఓటరు జాబితాలో నమోదు కానివారిని ఓటరు జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. అలాగే ఫోటో కరక్షన్ బిఎల్ఓ ద్వారా చేయించుకోవచ్చన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ అక్టోబర్ 28న ప్రచురించడం జరుగుతుందని , క్లైమ్స్, అభ్యంతరాలు అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 24న క్లైమ్స్, అభ్యంతరాలు పరిష్కరించి తుది జాబితా 2025 జనవరి 6న ప్రచురించటం జరుగుతుందన్నారు. కష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు పదవీ కాలం మార్చి 2025న ముగుస్తున్నందున పట్టభద్రుల ఎన్నికలకు గ్రాడ్యుయేట్స్ ఓటరు నమోదు కార్యక్రమం ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుండి నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు 2020కి ముందు డిగ్రీ ఉత్తీర్ణత పొంది, ఉమ్మడి గుంటూరు , కష్ణా జిల్లాలో నివసిస్తున్న వారిని ఓటరుగా నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు డాక్టర్ సేవాకుమార్, రాచుమల్లు భాస్కరరావు, వై.కష్ణకాంత్, బిళ్ళా సునీల్ , కె. శివరామయ్య పాల్గొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జిఎంసి అడిషనల్ కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ

స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ దక్కాలి

తెనాలిలో స్వాతంత్రోద్యమ ఘట్టాల ప్రదర్శన - తాడేపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో జనజాగరణ

ప్రజాశక్తి - తెనాలి

దేశ విభజన గాయాల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అరుదైన చిత్రాలతో కూడిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తెనాలి రైల్వేస్టేషన్‌లో బుధవారం ప్రారంభించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ గుంటూరు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ప్రదర్శనను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. సుదీర్ఘ స్వాతంత్ర్య సమరంలో అద్భుతమైన, స్ఫూర్తిదాయకమైన ఘట్టాలను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. తెనాలిలో విజ్ఞానాత్మక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ గుంటూరు ఫీల్డ్ ఆఫీస్‌ను అభినందించారు. ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా విభజనతో పాటు స్వతంత్ర కథనాలను మరింత తెలుసుకోవడానికి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీబీసీ గుంటూరు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఆర్ రమేష్ చంద్ర, విజయవాడ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కోఆర్డినేషన్) వరుణ్ బాబు, రైల్వే అధికారులు కె శ్రీనివాసరావు, ఎన్ వెంకట్ రావు, శౌరిబాబు, ఎన్ వెంకటేశ్వర్లు తదితరులు ప్రదర్శనను తిలకించారు.

ప్రజాశక్తి-గుంటూరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజిలో నిర్వహించిన సదస్సులో ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం జనరల్ సెక్రెటరీ హనుమంతరెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను గుర్తు చేశారు. చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జి.శాంతమూర్తి మాట్లాడుతూ విద్యార్థినులకు జీవితం పట్ల దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఐ.కార్తీక్, కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :అనేక మంది వీరులు త్యాగం చేసి సాధించిన స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ దక్కాలని సిఐటియు తాడేపల్లి డివిజన్ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. బుధవారం రాత్రి సిఐటియు ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనజాగరణ ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర గాయకులు ఎ.జగన్ ఆధ్వర్యంలో ఆర్‌వి రాఘవయ్య, శ్రీను తదితరులు పలు దేశభక్తి గీతాలను ఆలపించారు. పార్లమెంట్‌లో తగినంత బలం లేకపోయినా బిజెపి తన విచ్ఛిన్నకర విధానాలను అవలంభిస్తోందన్నారు. మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సిహెచ్.భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో ప్రదర్శనను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



తాడేపల్లిలో జన్‌జాగరణ్‌లో పాటలుపాడుతున్న జగన్



గుంటూరులో మాట్లాడుతున్న హనుమంతరెడ్డి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులు బాసిన మతవీరులకు తెనాలి జెఎంజె కళాశాల ఎన్సిసి విద్యార్థులు బుధవారం అంజలి ఘటించారు. సుల్తానాబాద్ కళాశాల నుంచి మార్చ్ ఫాస్ట్ నిర్వహించి రణరంగ్ చౌక్ స్వతంత్ర సమరయోధులు స్థూపాలకు పూల మాలలు వేసి ఘనమైన నివాళిలర్పించారు. డాక్టర్ అరుణ సుజాత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జెఎంజె కళాశాల ప్రిన్సిపాల్ షైనీ తదితరులు పాల్గున్నారు.

సెయింట్ ఆన్స్‌లో 'అమ్మ పేరుతో ఒక మొక్క'

ప్రజాశక్తి-గుంటూరు



మొక్కలు నాటుతున్న ఎన్‌సిసి విద్యార్థులు

స్థానిక గోరంట్ల లోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమ్మ పేరుతో ఒక మొక్క అనేక కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవ.సి.సంధ్య ఎన్‌సిసి క్యాడెంట్లతో కలిసి కళాశాల ప్రాంగణం, గోరంట్ల పరి సర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరెడ్డి, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ కె.సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

టుబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

అనంత జీవకోటితోపాటు మానవులూ క్షేమంగా జీవనాన్ని కొనసాగించాలంటే పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందనిటుబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రైతునేస్తం ఫౌండేషన్‌లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై జరిగిన అవగాహన సదస్సులో అద్దంకి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మిగతా జీవరాశులతో పోల్చుకుంటే మనిషే పర్యావరణాన్ని ఎక్కువగా వినాశనం చేస్తున్నాడు. తమ స్వార్థం కోసం మానవులు చేసిన తప్పిదాల వలన పర్యావరణ భవిష్యత్తు గందరగోళంగా తయారయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. కాబట్టి పర్యావరణాన్ని పరిరక్షించవలసిన అవసరం మన చేతుల్లోనే ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వక్తత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏవిఎన్ఎస్ ప్రసాద్, జయశ్రీ, వాగోలు వేంకటేశ్వరరావు, షేక్ బాజిద్‌ఖాన్, రామాంజనేయులు, మల్లికార్జునరావు, నేరేళ్ళ తిరుపతిరావు (చిన్నస్వాములు)మరియు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు వస్తువులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

100 మంది విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో మంగళగిరికి చెందిన గుంటూరు పార్లమెంట్ పద్మశాలి సాధికార సమితి సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ సహకారంతో షైన్ ఆనంద శరణాలయంలో టీడీపీ నాయకులు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. బుధవారం శరణాలయంలోని 100 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, తదితర సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి జానకి దేవి, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, రాష్ట్ర సాధికార సమితి కృష్ణ బలిజి సభ్యుడు అన్నం నాగబాబు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, మంగళగిరి నియోజకవర్గం టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి గోసాల రాఘవ, లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు, ఆకురాతి నాగేంద్రం, మునగాల శ్రీనివాసరావు, పట్టణ బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి ఒడిశా నరేష్, 163 బూత్ కన్వీనర్ నాగరాజు, 14 వార్డు అధ్యక్షులు కొల్లి వేణుబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉడత కోటేశ్వరావు, ఆకురాతి లక్ష్మణ్, దామర్ల హరి మోహన్ రావు మరియు ఆశ్రమ నిర్వాహకురాలు జి సంధ్యారాణి, చైర్మన్ డి.జి. నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో నిర్వహిస్తున్న బూత్ లెవెల్ ఆఫీసర్ల సమావేశం

సర్వే సక్రంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు సక్రమంగా చేయాలని పెదకూరపాడు మండల తహశీల్దార్ డానియేలు కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద బూత్ లెవెల్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమరి రివిజన్ 2025 కోసం సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీ నుండి బిఎల్వోలు ఇంటింటికి తిరిగి కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపులు, మరణించిన వారి జాబితా తయారు చేసేందుకు అవసరమైన సలహాలు సూచనలు చేశ్శారు.



మాట్లాడుతున్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉమారాణి

చదువుతో మానసిక సైర్థ్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం సంతగుడి పాడులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం మహిళా సాధికారత పై అవగాహన సదస్సు జరిగింది. 100 రోజుల మిషన్ శక్తి సంకల్ప్- మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవ గాహన సదస్సు జరిగింది. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారిణి ఉమారాణి మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ల లోపు వివాహం చేయొద్దని, చిన్న వయస్సులో వివాహం చేస్తే మాన సికంగా, సామాజికపరంగా నష్ట పోతారని అన్నారు. చైల్డ్ హెల్ఫ్ లైన్ ఉపయోగించు కోవాలని, ఆడపిల్లలకు చదువు ద్వారా మానసిక సైర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఐసిడిఎస్ పిడి ఉమారాణి,సిడిపిఒ ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్ పి.బాల శౌరీలు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు కె.శశి దేవి, డి.దేవి బాయి, ఎస్.కె. షమీమ్ సుల్తానా, అంగన్వాడీ టీచర్లు, ఉపా ధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో మండల విద్యాశాఖాధికారి తదితరులు

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-అమరావతి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మండల పరిషత్, ఎయిడెడ్ మేనే జ్మెంట్లలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యా ర్థులకు స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హై స్కూల్‌లో వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహిం చారు. మండల విద్యా శాఖాధికారి సిహెచ్ శివబాబు ఆధ్వ ర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. మండల కార్యా లయంలో ఆగస్టు 15న విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.







మాచర్లలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, ర్యాలీ చేస్తున్న కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు, గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ

మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

ప్రజాశక్తి-మాచర్ల

ఎందరో మహనీయుల పోరాటం, త్యాగాల ఫలి తమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యా లని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బిజెపి ఆధ్వ ర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. అనంతరం జాతిపిత గాంధీ విగ్రహానికి పూలమాలవేసి, 500 అడుగుల జాతీయ జెండాతో బస్టాండ్ నుండి మున్సి పల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు కె.దుర్గారావు, వై.మల్లిఖార్జున రావు, వై.కేశవరెడ్డి, ఎస్.యలమంద, కె.వెంకటేశ్వర్లు,కె. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్కూల్ విద్యార్థుల ర్యాలీ

స్వాతంత్ర్య, ఉజ్వల భారతదేశం కోసం పోరాడిన అమరవీరల ఆశయాలను నిలబెడతామని, అన్ని రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెడతామని స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం స్కూల్ ప్రిన్సిపల్ అయ్యపరెడ్డి హరణి ఆధ్వరంలో విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి అంబే ద్కర్ సెంటర్ మీదుగా స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సిసి బ్యాండ్‌తో జాతీయ గీతాలను ఆలపించారు.

గణపవరం జడ్పీ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-నాదెండ్ల

స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహించారు సుమారు 850 మంది విద్యార్థులు 365 అడుగుల భారీ జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

జాతీయ జెండాలు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



నవ చైతన్య వివేకా సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాలు ఉచితంగా బుధవారం పంపిణీ చేశారు. నవ చైతన్య వివేకా సేవా సమితి అధ్యక్షులు నోముల వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు ,రాజకీయ నాయకులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ కార్యా లయాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో నేడు జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి పల్నాడు ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నారు. జాతీయ జెండాను ఎగుర వేయడం ప్రభుత్వ రంగంలో విశేష సేవలు అందిస్తున్న వారిని మంత్రి సత్కరించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను నరసరావుపేట ఎమ్మెల్యే



వాగ్దేవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 150 అడుగుల జాతీయ పతాకం



నరసరావుపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, అడిషనల్ ఎస్పీ

డాక్టర్ చదలవాడ అరవింద బాబు,అడిషనల్ ఎస్పీతో కలిసి పరిశీలించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చూపినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు,సామాన్యులకు అన్ని సదు పాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. నరసరావుపేటలోని వాగ్దేవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 150 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవి ష్కరించారు. 3000 మంది విద్యార్థులు, ప్రజలతో భారీ ర్యాలీ చేపట్టారు ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

వడ్డెర్లకు అండగా ఉంటా : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల



వడ్డెర కులస్థులకు అండగా ఉంటానని,వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో కళ్యాణమండప నిర్మా ణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి వడ్డెర కులస్తులు తమ పార్టీకి అండగా వున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు వి.నాగయ్య, జి.రామారావు, ఆదినారాయణ, యు.రమేష్, టిడిపి నాయ కులు వై.మల్లిఖార్జునరావు, వై.కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం రొంపిచర్ల బిసి కాలనీలో గల భగత్ సింగ్ భవన్ లో ఈ నెల 13న విద్యార్థులకు 'దుర్వ్య సనాలు-దేశ ప్రగతిపై ప్రభావాలు' అనే అంశంపై నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతల వివరాలను నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి ఎస్.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ నెల 13న విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కల్లి శ్రీ విద్య ప్రథమ బహుమతి, గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గోనుగుంట్ల రామతులసి ద్వితీయ బహుమతి, ఎన్.కృపారాణి తృతీయ బహుమతికి ఎంపికైనట్లు చెప్పారు. గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినీలు కె.ద్వారక, జె.శివనాగమణి, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వతరగతి విద్యార్థిణులు ఆర్.భవ్యశ్రీ, ఎస్.కె.షిఫా, సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థిని జి.త్రివేణి కన్సోలేషన్ బహుమతులకు ఎంపికైనట్లు వివరించారు. వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు, వారికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15 న వారి పాఠశాలలకు వెళ్లి బహుమతులు అందజేస్తామన్నారు.



చిత్రలేఖనం, వేషధారణ, దేశభక్తి గేయాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం జనవిజ్ఞాన వేదిక,షేక్ లాలూ దాదా సాహెబ్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వేషధారణ, దేశభక్తి గేయాలు పోటీ నిర్వ హించి బహుమతి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా అర్బన్ సిఐ రమేష్ హాజరై బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు టి.సుబ్బారావు, లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-మాచర్ల

జీవవైవిధ్య పరిరక్షణపై బాల్యదశ నుండే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ కాంతారావు సూచించారు. స్థానిక జడ్‌పి బాలుర హైస్కూల్‌లో బుధవారం 'జీవవైవిధ్య సంరక్షణలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఆయేషా సుల్తానా, హెచ్ఎం సకీనా, మరో హెచ్ఎం గంగాధర్‌బాబు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నాణ్యమైన ఆహారం అందిస్తాం

గుంటూరులో అన్న క్యాంటీన్లను పరిశీలించిన మంత్రి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి 100 ప్రాంతాల్లో అన్న క్యాంటిన్లను ప్రారంభిస్తున్నామని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని అన్న క్యాంటిన్‌ను బుధవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో 183 క్యాంటిన్ల ద్వారా పేదలకు రూ.5లకే అల్పాహారం, భోజనం అందించా మన్నారు. నాణ్యమైన ఆహారాన్ని ఐదు రూపాయలకే అందిస్తామన్నారు. నాణ్యత విషయంలో రాజీలేదన్నారు. పేద, నిరు పేదల కోసమే అన్నా క్యాంటిన్లు అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రోజుకి ఒక వ్యక్తికి ఆహారం అందించడానికి రూ. 90 ఖర్చవుతుందన్నారు. రూ.15 వినియోగదారుడు చెల్లిస్తే, 75 రూపాయలు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రూ. కోటి విరాళం ఇచ్చిన వారి పేరుతో ఒక రోజు ఆహారం అందిస్తామన్నారు. వైసిపి వాళ్ళు రివర్స్ టెండరింగ్ పేరుతో అన్ని నాశనం చేశారన్నారు. అవినీతి లేకుండా అన్నా క్యాంటిన్లు ఏర్పాటు చేశామన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన ఫించన్లు అందించామన్నారు. ఏడాదికి రూ.33 వేల కోట్లు ఫించన్ల కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఒక్కొక్కటిగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. సంక్షేమంతో పాటు అభివద్ధి కూడా చేస్తామన్నారు. గత పాలనలో అన్ని పార్టీల నాయకులు అసంతప్తికి లోనయ్యారని అన్నారు. అందువల్లే వైసిపి కార్పొరేటర్లు ఎక్కువ మంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే గళ్ళామాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


చుట్టుగుంట సెంటర్‌లో అన్నక్యాంటిన్ సందర్శించిన మంత్రి నారాయణ

ప్రజా సమూహాల భాగస్వామ్యంతోనే సమ్మిళత భారత్

డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యవసాయ రంగాన్ని మరింతగా ప్రోత్సహించాలని అప్పుడే దేశ ప్రగతి, పారిశ్రామిక పురోగతి మెరుగ్గా ఉంటాయని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ తెలిపారు. బుధ వారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో స్వతంత్ర భారత్ ప్రగతి - అవరోధాలు అనే అంశంపై జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయరాదని, రైతులకు మరిన్ని ప్రోత్సహకాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయంతోనే సేవా రంగం, పారిశ్రామిక రంగం పురోభివృద్ధి సాధిస్తాయన్నారు. పండిట్ జవహల్ లాల్ నెహ్రూ మొదటి ప్రధానిగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థను రూపొందించి, ప్రభుత్వ సంస్థల బలోపేతానికి కృషిచేసి, ఆర్థిక పునాదులు వేసారన్నారు. బి. ఆర్. అంబేద్కర్ భారత జాతి ఆత్మగా రాజ్యాంగాన్ని రూపొందించి దేశ సమగ్రతను, సాధికారతను సాధించారన్నారు. దేశ పురోగమనానికి హేతుబద్ధ ఆలోచనలు, బావ ప్రకటన స్వేచ్ఛ అవసరమన్నారు.ఉంటుందన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ,ప్రముఖ ఆర్థికవేత్త హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ అబ్బరాజు రాజశేఖర్, ప్రముఖ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి. శేషుబాబు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ కుమార్, మాజీ యం. యల్. ఎ. లింగం శెట్టి ఈశ్వరరావు, జాతీయ పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, మానవత నేతలు సాయిరాం, శివాజీ, సాంబశివరావు, తదితరులు ప్రసంగించారు.





శ్రీచైతన్యలో క్యాబినెట్ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక శ్యామలా నగర్, శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం విద్యార్థి నాయకులు బ్యాడ్జీల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీచైతన్య గుంటూరు, ప్రకాశం జిల్లాల జోన్ ఏజిఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య మాట్లాడుతూ మంచి నాయకుడే మంచి పరిపాలన అందించగలడని, విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణలు అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కె.అరుణ మాట్లాడుతూ నేటి బాలలే భావి తరానికి నాయకులుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ మూర్తి, డీన్ శివప్రసాద్, ఏఒ శివకుమార్, జోనల్ పిఇటి ఇన్‌చార్జి ఎన్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు తహశీల్దారుగా పి.శంకర్‌బాబు

ప్రజాశక్తి - పెదనందిపాడు



పెదనందిపాడు నూతన తహశీల్దారుగా పి శంకర్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాష్ట్ర సచివాలయంలో హెల్త్ అండ్ మెడికల్ డిపార్ట్మెంట్లో బాధ్యతలు నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. నూతన తహశీల్దార్‌కు మండలంలోని పలు విభాగాల అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ప్రజల తమ సమస్యలను రెవెన్యూ సదస్సులలో అర్జీలు రూపంలో సమర్పించి వెంటనే పరిష్కారం పొందవచ్చునని బుధవారం తాసిల్దార్ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం తిరుగుతూ సమస్య పరిష్కారం కాకుండా ఇబ్బందులు పడేవారు ఆయా సదస్సులో అర్జీని సమర్పించి పరిష్కారం పొందవచ్చునని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు అని ఆయన దష్టికి తీసుకువెళ్లగా తాసిల్దార్ పై విధంగా స్పందించారు.అధికారులు సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు కుంచనపల్లి లో శ్రీ శ్రీనివాస కన్వెన్షన్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

నేటి డిజిటల్ యుగములో అత్యాధునిక సాంకేతిక వసతులతో ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి లో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మాణం జరుపుకున్న శ్రీ శ్రీనివాస కన్వెన్షన్ (కళ్యాణ మండపం) గురువారం ఉదయం 9 గంటలకు, శ్రీనివాస కళ్యాణంతో ప్రారంభం అవుతుందని, ఫార్ఛ్యూన్ గ్రూప్ అధినేత ల లో ఒకరైన కొండా ప్రతాప్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పచ్చని పంట పొలాల, ఆహ్లాదకరమైన వాతావరణంలో సుమారు మూడు వేల మంది ఆతిథ్యం ఇచ్చే, వివిధ రకాల వేడుకలు జరుపుకునేందుకు అణువుగా ఈ కన్వెన్షన్ ను నిర్మించినట్టు ఆయన తెలిపారు. నేడు జరిగే ప్రారంభోత్సవ కళ్యాణానికి ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు

ప్రజాశక్తి-తాడేపల్లి : పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేస్తే మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉండి కూడా గత రెండు సంవత్సరాలకు పైగా నియోజకవర్గంలో మూడు అన్న క్యాంటీన్లను నిర్వహించారని తెలిపారు. ఎన్నికలకు ముందు చెప్పినట్టుగానే అన్నా క్యాంటీన్లను రెండు నెలల్లోనే కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తుందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. 15వ తేదీ నుంచి మూడు పూటలా పేదలకు ఆకలి తీరనుందన్నారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించనుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడివాడలో గురువారం అన్నాక్యాంటీన్ ను ప్రారంభించనున్నారని తెలిపారు.



ప్రజాదర్బార్‌లో విన్నపం... సిఎం చేతుల మీదుగా ప్రోత్సాహకం

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రతిభకు పేదరికం అడ్డు రాకూడదన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అమెరికా యూత్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌లో ఎంపికైన రాష్ట్ర బాలికలు తమ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ సాయం చేయాలని అభ్యర్థించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన సూర్యతేజశ్రీ, రాజమండ్రికి చెందిన ప్రదీప్తి ఇంటర్మీడియట్‌లో బాగా రాణిస్తున్నారు. స్టడీ టూర్ కోసం యూత్ ఎక్సేంజ్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది ఎంపికయ్యారు. విద్యార్థినులు తమ ఆర్థిక పరిస్థితిని ప్రజాదర్బార్‌లో లోకేష్‌కు వివరించారు. వెంటనే స్పందించిన ఆయన రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు ల్యాప్‌టాప్‌లను సిఎం చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థినులు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తాడేపల్లిలో పేరుకుపోతున్న చెత్త

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లిలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. కాల్వలో నుంచి తీసేసిన చెత్త రోడ్ల మీద వారాల తరబడి ఎండిపోయి దర్శనమిస్తుంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు ఎండిపోయిన చెత్త వల్ల వస్తున్న దుర్వాసన భహరించలేకపోతున్నామని వాపోతున్నారు. దీనికి తోడు దోమల బెడద కూడా ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉండవల్లి సెంటర్ ప్రాంతాల్లో జ్వరాల ఉండటంతో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. దీనికి తగినంత సిబ్బంది లేకపోవడమే కారణమని కార్మికులు చెబుతున్నారు. ఇద్దరు చేసే పని ఒక్కరే చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. తాడేపల్లి పట్టణంలో ప్రస్తుతం పని చేస్తున్నారు. పట్టణ పరిధి పెరగడంతో కనీసం పారిశుధ్య కార్మికులను నియమిస్తేగానీ పట్టణం బాగుపడదని ప్రజలు భావిస్తున్నారు.


మధుసూదనరావుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాస్టల్ విద్యార్థులపై అఘాయిత్యానికి పాల్పడిన

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు

హాస్టల్ బాలికలను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదన్‌రావుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకునే తరుణంలో బాలికలపై ఇలాంటి దారుణం జరగటం బాధాకరమన్నారు. పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయా లని కోరారు. వార్డెన్లు కొంతమంది విద్యార్థినులను బానిసలుగా చూస్తు వారితో పనులు చేయించటం సర్వసాధారణమైందని, ఇటువంటి చర్యలను వెంటనే ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి కె.పవన్, ఎ.యశ్వంత్ పాల్గొన్నారు.


ధీరజ్, ఇర్ఫాన్‌ను అభినందిస్తున్న నందకిషోర్, శ్రీలక్ష్మీ

శ్రీమేధలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీమేధ విద్యా సంస్థల ఫ్రెషర్స్‌డే వేడుకలు స్థానిక ఎటిఎ కళ్యాణ మండపంలో నిర్వహిం చారు. కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా నందకిషోర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సిఎ ఓరియెంటెడ్ కోర్సు వల్ల సిఎ పూర్తి చేయటం సులభతరం అవుతుందన్నారు. మోటివేషనల్ స్పీకర్ అయ్యప్ప మాట్లాడుతూ ఉలి దెబ్బలకు ఓర్చుకున్న రాయి శిల్పంగా మారుతుందని, అదే విధగా గురువుల బోధనను అనుసరిస్తే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారని అన్నారు. అనంతరం ఇటీవల సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించిన అన్నా ధీరజ్, షేక్.ఇర్ఫాన్‌కు మెమోంటోలు అంద చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆటో డ్రైవర్ నిజాయితి

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరి-ఓ ఆటో డ్రైవర్ మానవత్వాన్ని చాటుకున్నారు. బుధ వారం గుంటూరు నుంచి మంగళగిరి కి ఓ మహిళ ఆటోలో వచ్చింది.ల్యాబ్ టాప్, పలు వెండి వస్తువులు ఉన్న బ్యాగ్ ను ఆటోలో మర్చిపోయింది. ఆ బ్యాగ్‌ను సురేష్ అనే ఆటో డ్రైవర్ పట్టణ పోలీస్ స్టేషన్లో అప్పగించాడు. కొద్దిసేపటి తర్వాత సదరు మహిళ సైతం పోలీస్ స్టేషన్ కు చేరుకొని తన బ్యాగ్ పోయిందని. పట్టణ సీఐ వినోద్ కుమార్ ను కలిసి ఫిర్యాదు చేసింది. ఆటో డ్రైవర్ సురేష్‌ను పిలిపించిన సీఐ వినోద్ కుమార్ ఆటో డ్రైవర్ చేతుల మీదుగా ల్యాబ్ ట్యాప్,వెండి వస్తువులను అందజేయించారు. మానవత్వాన్ని చాటుకున్న ఆటో డ్రైవర్ సురేష్ కు స్పందించి తక్షణమే ల్యాబ్ ట్యాప్ వెండి వస్తువులను అంద జేయించిన సిఐ వినోద్ కుమార్ కు మహిళ కృతజ్ఞ తలు తెలిపింది.


మహిళకు బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్

ఆర్‌విఆర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ మందలపు శ్రీనివాసరావుకు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీనివాసరావు 'యాన్ ఇంటెలిజెన్స్ ఫ్రేమ్ వర్క్ ఫర్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ ఇన్ ఈ-కామర్స్ అండ్ సోషల్ మీడియా ఆటోమేటిక్ సజిషన్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయనకు అన్నామలై యూనివర్సిటీకి చెందిన డాక్టర్ బి.నారాయణన్ గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాలలో పిహెచ్‌డి కలిగిన స్టాఫ్ మొత్తం 145 మంది ఉన్నట్లు కళాశాల అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. డాక్టరేట్ పొందిన శ్రీనివాసరావును సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

కళ్లం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగార్జునకు డాక్టరేట్



ప్రజాశక్తి-గుంటూరు : కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వలేటి నాగార్జునకు హిందూస్తాన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగార్జునా క్లౌడ్ కంప్యూటింగ్ విత్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయనకు హిందూస్తాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.శిరోర్మణి షర్మిళ గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాగార్జునను ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ వి.రాజీవ్ జిట్సన్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కేంబ్రిడ్జ్, విజ్ఞాన్స్ ప్రతినిధులు

విజ్ఞాన్స్‌తో కేంబ్రిడ్జి ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జి యూనివర్సిటీలోని ఇంగ్లీష్ అసెస్‌మెంట్ విభాగం వారు వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీతో లింగ్వాస్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) చేసుకున్నట్లు విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను కేంబ్రిడ్జి యూని వర్సిటీ సౌత్ ఏసియా రీజనల్ డైరక్టర్ అరుణాచలం, సౌత్ ఇండియా డీజీఎం కార్తి సుబ్రమణియన్‌కు విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అందించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ వీసీ మాట్లాడుతూ కేంబ్రిడ్జి వారు లింగ్వాస్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌ను ప్రపంచ వ్యాప్తంగా మొట్టమొదటగా తమ యూనివర్సిటీలోనే ప్రయోగాత్మకంగా ప్రవేశ పెడుతున్నారని తెలియజేశారు. అంతేకాకుండా విజ్ఞాన్స్ యూనివర్సిటీలో కేంబ్రిడ్జి సెంటర్‌ను, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను నెలకొల్పి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇండస్ట్రీ పార్టనర్స్‌ను, పారిశ్రామికవేత్తలను కేంబ్రిడ్జి వారు ఇక్కడికి తీసుకువచ్చి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యేలా చేస్తారని పేర్కొన్నారు. న్యూ లింగ్వాస్కిల్ ఆన్‌లైన్ పరీక్ష వలన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా విద్యార్థుల ఆంగ్ల స్థాయిలను తనిఖీ చేయవచ్చునన్నారు. మాడ్యూల్స్‌లో మాట్లాడటం, రాయడం, చదవడం, వినడం అనే నాలుగు భాషా నైపుణ్యాలను పరీక్షిస్తుందన్నారు. ఈ ప్రత్యేక కోర్సుల ఫలితంగా ఇక్కడి విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆంగ్ల భాషను నేర్చుకోగలుగుతున్నారని చెప్పారు.కార్యక్రమంలో కేంబ్రిడ్జి కార్పొరేట్ రిలేషన్స్ రీజనల్ మేనేజర్ పద్మజ శివకుమార్, ఈఎల్‌టీ మేనేజర్ మలికార్జున నాయుడు పచిపాల, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వై.వి.ఆంజనేయులు తదితరులు

25న చలపతి ఫార్మసీలో చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

చలపతి ఫార్మసీ కళాశాలలు ఆనంద్ చెస్ వింగ్స్ సహకారంతో ఈనెల 25న మోతడకలోని చలపతి ఫార్మసీ కాలేజి ప్రాంగణంలో తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తెలిపారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ యం.గోపీనాథ్‌తో కలిసి చెస్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించారు. వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.77,777ల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు రూ.700లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఇతర వివరాల కోసం యం.గోపినాథ్(9703049379) నంబర్‌లో సంప్రదించాలన్నారు.





నరసరావుపేట కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో, గుంటూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు

నేడు స్వాతంత్ర్య దినోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పరిశీలించిన కలెక్టర్లు, అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో నేడు నిర్వహిస్తున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజతో కలసి పరిశీలించారు. పెరేడ్ గ్రౌండ్‌లో వేదిక, వివిధ శాఖలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్ , విఐపి గ్యాలరీ , స్టూడెంట్స్ గ్యాలరీ , పబ్లిక్ గ్యాలరీ , మీడియా గ్యాలరీ లను పరిశీలించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెచ్‌ఆర్డీ, ఐటి ఎలక్ట్రానిక్స్ , కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ పాల్గొని జాతీయ పతాక ఆవిష్కరణ చేపట్టనున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ జాతీయ ఆవిష్కరణ చేసిన తర్వాత పెరేడ్ ఇన్స్పెక్షన్ , శకటాల పరిశీలన , విద్యార్థులచే జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించిన అనంతరం విధుల్లో ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు కమాండేషన్ సర్టిఫికేట్లు అందిస్తారన్నారు. జాతీయ పతాకావిష్కరణ ఉదయం 9 గంటలకు చేపట్టడం నుండి దాదాపు మధ్యాహ్నం 12.15 వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓపి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ , జెడ్పి డిప్యూటీ సిఈఓ మోహన్ రావు, డిటి డబ్ల్యూఓ శిరీష , జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నరసరావుపటలోని కోడెల శివ ప్రసాద రావు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణం లో నిర్వహించనున్న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పల్నాడు జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేజి ఏర్పాటు, వి.ఐ.పి, వి.వి.ఐ.పి గ్యాలరి మరియు స్టాల్ ల ఏర్పాట్లను పరిశీలించి సంబందిత అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమములో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, రెవెన్యూ డివిజినల్ అధికారి పి. సరోజిని , రోడ్లు భవ నాల శాఖ అధికారి రాజా నాయక్, డి.ఆర్.డి.ఎ. పథకం సంచాలకులు బాలూ నాయక్, అడిషనల్ ఎస్పీ ఆర్ రాఘవేంద్రరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన కమిషనర్

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



నూతన కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పులి శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా పనిచేస్తూ బదిలీపై ఆయన గుంటూరు కమిషనర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మేయర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ నగరాన్ని అన్ని అంశాల్లో మెరుగ్గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, పారిశుధ్యం, తాగునీటి సరఫరా మెరుగుదలకు ప్రాధాన్యమిస్తానని చెప్పారు. గతంలో గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పని చేసినందున నగరంపై సమగ్ర అవగాహన ఉందన్నారు. అధిక మొత్తంలో ఆస్తి పన్ను బకాయి ఉన్న మొండి బకాయిదార్ల నుండి పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తామని, ఆదాయ వనరుల పెంపు, ఉన్న వనరులను సద్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాల అధికారులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, మేయర్ కావటి మనోహర్ నాయుడు కమిషనర్ కలిసి వివిధ అంశాలపై మాట్లాడారు.

వర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లో అన్నంలో పురుగులు

యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థినుల హాస్టలో అందించే భోజనంలో పురుగులు వస్తున్నాయని ఎస్‌ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ తెలిపారు. బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్‌కు ఈ సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతు విద్యార్థినుల హాస్టల్‌లో తినే ఆహారంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా పట్టించు కోలేదన్నారు. గత నెల రోజుల నుండి పలుమార్లు యూనివర్సిటీ గర్ల్స్ చీఫ్ వార్డెన్ కు చెప్పినా ఫలితం లేదన్నారు. హాస్టల్‌లో భోజనంలో పురుగులు రావటం, భోజనం సరిగా లేకపోవడం పదేపదే జరుగుతుందని తెలిపారు. హాస్టల్లో మెస్ కమిటీ లేకపోవడం వల్ల కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించి రుచికరమైన భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సెక్రెటరీ కె.నవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, మరియమ్మ, రిచా, మౌనిక, జిల్లా జాయింట్ సెక్రెటరీ పవన్, జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వర్సిటీలో ఫొటో కాంటెస్ట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫోటోగ్రఫీ విభాగం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఫోటో కాంటెస్ట్ 2024 పోటీల ఫలితాలను బుధవారం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు విడుదల చేశారు. మోనోగ్రామ్, కలర్, నేచర్, ట్రావెల్, జర్నలిజం అనే ఐదు అంశాలపై నిర్వహించిన ఈ పోటీలకు 800 ఎంట్రీలు రావడం గమనార్హం. వచ్చిన ఎంట్రీలను ఫోటోగ్రఫీలో నిష్ణాతులు ఫోటోగ్రాఫర్‌లను జ్యూరీ సభ్యులుగా ఎంపిక చేసి విజేతలను నిర్ణయించినట్లు ఫోటో కాంటెస్ట్ చైర్మన్, విభాగాధిపతి డాక్టర్ జి. అనిత తెలిపారు. విభాగంలో తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీలకు అనూహ్య స్పందన రావడం గమనార్హమని, ఈ స్పందనను దృష్టిలో పెట్టుకుని మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు డాక్టర్ అనిత పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని ఉత్సాహవంతులు, ఈ కోర్సులో చేరాలనుకునేవారు యునివర్సిటీ అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని డాక్టర్ అనిత కోరారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ గంగాధరరావు విజేతలను అభినందించారు. ఈ నెల 19 న 185వ వరల్డ్ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంలో విభాగం అధ్యాపకులు టి. శ్రీనివాసరెడ్డి, యూనివర్సిటీ ఫోటోగ్రాఫర్ జి .సునీల్ కుమార్ పాల్గొన్నారు.

